సుమతీ శతకము

13053

బాలబాలికల కత్యంతనీతిబోధకంబగు

Sumati S'atakam

సుమతి శతకము.

పబ్లిషర్సు

మారుతిరాం అండ్ కో.,

బుక్ సెల్లర్సు,

బెజవాడ.

1934.

వెల రు. 0—1—0.

మారుతి హిందూదేశ చరిత్రము.

గ్రంథకర్తలు :

యన్. యస్. సోమయాజులుగారు, బి.ఏ., ఎల్.టి.,

మునిమాణిక్యం నరసింహారావుగారు, బి.ఏ., ఎల్.టి.,

మారుతి హిందూదేశచరిత్రకథలు	4, 5 త		అప్రూవుడు	0- 5-0
ఆంధ్రదేశ చరిత్ర కథలు	5 త		,,	0- 5-0
మారుతి హిందూదేశ చరిత్ర	1వ	ఫారము	,,	0- 8-0
డిటో	2వ	,,	,,	0-12-0
డిటో	3వ	,,	,,	0-12-0
గుంటూరుమండల చరిత్ర	4 తరగతి		,,	0- 4-0

మారుతి జాగ్రఫీలు.

గ్రంథకర్త :

అడిదం నారాయణమూర్తిపంతులు, ఎం.ఏ., ఎల్ టి.,

హెడ్‌మాష్టరు, మునిసిపల్ హైస్కూలు, అనకాపల్లి.

విశాఖపట్టణముజిల్లా భూగోళము			అప్రూవుడు	0- 4-0
మారుతి జాగ్రఫి	1వ	ఫారము	,,	0- 8-0
డిటో	2వ	,,	,,	0-10-0
డిటో	3వ	,,	,,	0-12-0
గుంటూరుజిల్లా భూగోళము (పి. అప్పారావు)				0- 4-0
కృష్ణాజిల్లా భూగోళము (N. S. Somayajulu, B.A.,L.T.)				0- 4-0
Maruti Primer (Anglo Telugu)				**0-2-0**

మావద్ద అన్ని కంపెనీలవారి వాచకములు, స్కూలు పుస్తకములు, సంస్కృతాంధ్ర గ్రంథములు, వైద్యగ్రంథములు, హరికథలు, బజారు రకము శతకములు గలవు. మంచి కమీషను యివ్వబడును.

వలయువారు:—మారుతిరాం అండ్ కో., బెజవాడ.

శ్రీరస్తు.

సుమతిశతకము.

శ్రీరాముని దయచేతను
నారూఢిగ సకలజనులు ♦ నౌరా యనఁగా
ధారాళమైన నీతులు
నోరూరఁగఁ జవులుపుట్ట ♦ నుడివెద సుమతీ!

కం॥ అక్కఱకు రాని చుట్టము
మ్రొక్కిన వర మీని వేల్పు ♦ మోహరమునఁ దా
నెక్కినఁ బాఱనిగుఱ్ఱము
గ్రక్కున విడువంగవలయుఁ ♦ గదరా సుమతీ. 2

కం॥ అడిగిన జీతం బియ్యని
మిడిమేలపు దొరను గొల్చి ♦ మిడుకుట కంటెన్
వడిగల యెద్దులఁ గట్టుక
మడిదున్నుక బ్రతుకవచ్చు ♦ మహిలో సుమతీ. 3

కం॥ అడియాస కొలువుఁ గొలువకు
గుడిమణియము సేయఁబోకు ♦ కుజనులతోడన్

విడువక కూరిమి సేయకు
మడవిని దోడరయ కొంటి ♦ యరుగకుము సుమతీ. 4

క॥ అధరము గదలియుఁ గదలక
మధురములగు భాషలుడిగి ♦ మౌనవ్రతుఁడౌ
నధికార రోగపూరిత
బధిరాంధక శవముఁ జూడఁ ♦ బాపము సుమతీ. 5

క॥ అప్పుగొని చేయు విభవము
ముప్పునఁ బ్రాయంపుటాలు ♦ మూర్ఖుని తపమున్
దప్పరయని నృపు రాజ్యము
దెప్పరమై మీఁదఁ గీడు ♦ దెచ్చుర సుమతీ. 6

క॥ అప్పిచ్చువాఁడు వైద్యుఁడు
నెప్పుడు నెడతెగక పాఱు ♦ నేఱును ద్విజుఁడున్
జొప్పడిన యూర నుండుము
చొప్పడకున్నట్టి యూరు ♦ చొరకుము సుమతీ. 7

క॥ అల్లుని మంచితనంబును
గొల్లని సాహిత్యవిద్య ♦ కోమలి నిజమున్
బొల్లున దంచిన బియ్యము
దెల్లని కాకులును లేవు ♦ తెలియుము సుమతీ. 8

క॥ ఆకొన్న కూడె యమృతము
తాకొంచక నిచ్చువాఁడె ♦ దాత ధరిత్రిన్
సోఁకోర్చువాఁడె మనుజుఁడు
తేఁకువ గలవాఁడె వంశ ♦ తిలకుఁడు సుమతీ. 9

కం॥ ఆఁకలి యుడుగని కడుపును
వేఁకటి యగు లంజ పడుపు ♦ విడువని బతుకున్
బ్రాఁకొన్న నూతి యుదకము
మేఁకల పాఁడియును రోఁత ♦ మేదిని సుమతీ. 10

కం॥ ఇచ్చునదె విద్య రణమునఁ
జొచ్చునదే మగతనంబు ♦ సుకవీశ్వరులున్
మెచ్చునదె నేర్పు వాదుకు
వచ్చునదే కీడు సుమ్ము ♦ వసుధను సుమతీ. 11

కం॥ ఇమ్ముగఁ జదువని నోరును
నమ్మా యని పిలిచి యన్న ♦ మడుగని నోరుం
దమ్ములఁ బిలువని నోరును
గుమ్మరి మను ద్రవ్వినట్టి ♦ గుంటర సుమతీ. 12

కం॥ ఉడుముండదె నూరేండ్లును
బడియుండదె పేర్మిఁ బాము ♦ పదినూరేండ్లున్
మడువునఁ గొక్కెర యుండదె
కడు నిలఁ బురుషార్థపరుఁడు ♦ గావలె సుమతీ. 13

కం॥ ఉత్తమ గుణములు నీచున
కెత్తెఱఁగునఁ గలుగ నేర్చు ♦ నెయ్యెడలం దా
నెత్తిచ్చి కరఁగి పోసిన
నిత్తడి బంగారు మగునె ♦ యిలలో సుమతీ. 14

కం॥ ఉదకము ద్రావెడు హయమును
మదమున నుప్పొంగుచుండు ♦ మత్తేభంబున్

మొదవు కడ నున్న వృషభముఁ
జదువని యా నీచు కడకుఁ ♦ జనకుర సుమతీ. 15

క॥ ఉపకారికి నుపకారము
విపరీతము గాదు సేయ ♦ వివరింపంగా
నపకారికి నుపకారము
నెపమెన్నక చేయువాఁడు ♦ నేర్పరి సుమతీ. 16

క॥ ఉపమింప మొదలు తియ్యన
కపటం బెడనెడను జెఱకు ♦ కైవడినే పో
నెపములు వెదకును గడపటఁ
గపటపు దుర్జాతిపొందు ♦ గదరా సుమతీ. 17

క॥ ఎప్పటి కెయ్యది ప్రస్తుత
మప్పటి కా మాటలాడి ♦ యన్యుల మనముల్
నొప్పింపక తా నొవ్వక
తప్పించుక తిరుగువాఁడు ♦ ధన్యుఁడు సుమతీ. 18

క॥ ఎప్పుడుఁ దప్పులు వెదకెడు
నప్పురుషునిఁ గొల్వఁగూడ ♦ దది యెట్లన్నన్
సప్పంబు పడగ నీడను
గప్ప వసించిన విధంబు ♦ గదరా సుమతీ. 19

క॥ ఎప్పుడు సంపద గలిగిన
నప్పుడె బంధువులు వత్తు ♦ రది యెట్లన్నన్
దెప్పలుగఁ జెఱువు నిండినఁ
గప్పలు పదివేలు చేరుఁ ♦ గదరా సుమతీ.

క॥ ఏఱకుమీ కసుగాయలు
దూఱకుమీ బంధుజనుల ♦ దోషము సుమ్మీ
పాఱకుమీ రణమందున
మీఱకుమీ గురువునాజ్ఞ ♦ మేదిని సుమతీ. 21

క॥ ఒకయూరికి నొకకరణము
నొకతీర్పరి యైనఁ గాక ♦ నొగిఁ దఱుచైనం
గకవికలు గాక యుండునె
సకలంబును గొట్టువడక ♦ సహజము సుమతీ. 22

క॥ ఒల్లనిసతి నొల్లనిపతి
నొల్లనిచెలికాని విడువ ♦ నొల్లనివాఁడే
గొల్లండు గాక ధరలో
గొల్లండును గొల్లఁడౌనె ♦ గుణమున సుమతీ. 23

క॥ ఓడలు బండ్లను వచ్చును
ఓడలు నాబండ్లమీఁద ♦ నొప్పుగ వచ్చున్
ఓడలు బండ్లును వలెనే
వాడంబడుఁ గలిమిలేమి ♦ వసుధను సుమతీ. 24

క॥ కడు బలవంతుండైనను
బుడమిని బ్రాయంపుటాలిఁ ♦ బుట్టినయింటం
విడువఁ బెట్టినేనియుఁ
బడుపుగ నంగడికిఁ దానె ♦ పంపుట సుమతీ. 25

క॥ కనకపు సింహాసనమున
శునకముఁ గూర్చుండఁబెట్టి ♦ శుభలగ్నమునం

దొనరఁగఁ బట్టము గట్టిన
వెనుకటిగుణ మేల మాను ♦ వినురా సుమతీ. 26

క॥ కప్పకు నొరగాలైనను
సర్పమునకు రోగమైన ♦ సతి తులువైనన్
ముప్పున దరిద్రుఁడైనను
తప్పదు మఱి దుఃఖ మగుట ♦ తథ్యము సుమతీ. 27

క॥ కమలములు నీటఁ బాసినఁ
గమలాప్తుని రశ్మి సోఁకి ♦ కమలిన భంగిన్
తమతమ నెలవులు దప్పినఁ
దమమిత్రులె శత్రులౌట ♦ తథ్యము సుమతీ. 28

క॥ కరణముఁ గరణము నమ్మిన
మరణాంతకమౌను గాని ♦ మనలేఁడు సుమీ
కరణము దసరికరణము
మఱి నమ్మక మర్మ మీక ♦ మనవలె సుమతీ. 29

క॥ కరణముల ననుసరింపక
విరసంబునఁ దిన్న తిండి ♦ వికటించుఁ జుమీ
యిరుసునఁ గందెనఁ బెట్టక
పరమేశ్వరుబండియైనఁ ♦ బాఱదు సుమతీ. 30

క॥ కరణము సాధై యున్నను
గరి మద మడఁచినను బాము ♦ గఱవక యున్నన్
ధరఁ దేలు మీటకున్నను
గర మరుదుగ లెక్కగొనరు ♦ గదరా సుమతీ. 31

క॥ కసుగాయఁ గఱచి చూచిన
మసలక దన యొగరు గాక ♦ మధురంబగునా
పసగలుగు యువతు లుండఁగ
బసిబాలలఁ బొందువాఁడు ♦ పశువు సుమతీ. 32

క॥ కవిగానివాని వ్రాఁతయు
నవరసభావములు లేని ♦ నాతుల వలపున్
దవిలి చను పంది నేయని
వివిధాయుధ కౌశలంబు ♦ వృథరా సుమతీ. 33

క॥ కాదు సుమీ దుస్సంగతి
పోదు సుమీ కీర్తికాంత ♦ పొందిన పిదపన్
వాదు సుమీ యప్పిచ్చుట
లేదు సుమీ సతులవలపు ♦ లేశము సుమతీ. 34

క॥ కాముకుఁడు దనిసి విడిచిన
కోమలిఁ బరవిభుఁడు గవయఁ ♦ గోరుట యెల్లన్
బ్రేమమునఁ జెఱకు పిప్పికిఁ
జీమలు వెస మూఁగినట్లు ♦ సిద్ధము సుమతీ. 35

క॥ కారణము లేని నగవును
బేరణము లేని లేమ ♦ పృథ్వీస్థలిలోఁ
బూరణము లేని బూరెయు
వీరణములు లేని పెండ్లి ♦ వృథరా సుమతీ. 36

క॥ కులకాంతతోడ నెప్పుడుఁ
గలహింపకు వట్టితప్పు ♦ ఘటియింపకుమీ

కలకంఠికంటఁ గన్నీ
రొలికిన సిరి యింట నుండ ♦ నొల్లదు సుమతీ. 37

క॥ కూరిమి గలదినములలో
నేరము లెన్నఁడును గలుగ ♦ నేరవు మఱి యా
కూరిమి విరసంబైనను
నేరములే తోఁచుచుండు ♦ నిక్కము సుమతీ. 38

క॥ కొంచెపు నరుసంగతిచే
నంచితముగఁ గీడు వచ్చు ♦ నది యెట్లన్నం
గించిత్తు నల్లి కుట్టిన
మంచమునకుఁ బెట్లు వచ్చు ♦ మహిలో సుమతీ. 39

క॥ కొక్కోకమెల్లఁ జదివినఁ
జక్కనివాఁడైన రాజ♦చంద్రుండైనన్
మిక్కిలి రొక్కము లియ్యక
చిక్కదురా వారకాంత ♦ సిద్ధము సుమతీ. 40

క॥ కొఱగాని కొడుకు పుట్టినఁ
గొఱగామియె కాదు తండ్రి♦గుణములఁ జెఱచున్
జెఱకు తుద వెన్ను పుట్టినఁ
జెఱకునఁ దీపెల్లఁ జెఱచు ♦ సిద్ధము సుమతీ. 41

క॥ కోమలి విశ్వాసంబును
బాములతోఁ జెలిమి యన్య♦భామల వలపున్
వేముల తియ్యఁదనంబును
భూమీశుల నమ్మికలును ♦ బొంకు సుమతీ. 42

క॥ గడనగల మగనిఁ జూచిన
నడుగడుగున మడుఁగు లిడుదు ♦ రతివలు దమలోఁ
గడనుడుగు మగనిఁ జూచిన
నడపీనుఁగు వచ్చె ననుచు ♦ నగుదురు సుమతీ. 43

క॥ చింతింపకు కడచినపని
కింతులు వలతు రని నమ్మ ♦ కెంతయు మదిలోఁ
నంతఃపుర కాంతలతో
మంతనములు మాను మిదియె ♦ మతముర సుమతీ. 44

క॥ చీమలు పెట్టిన పుట్టలు
పాముల కిరవైన యట్లు ♦ పామరుఁడు దగన్
హేమంబుఁ గూడఁబెట్టిన
భూమీశుల పాలఁ జేరు ♦ భువిలో సుమతీ. 45

క॥ చుట్టములు గానివారలుఁ
జుట్టములము నీ కటంచు ♦ సొంపు దలిర్పన్
నెట్టుకొని యాశ్రయింతురు
గట్టిగ ద్రవ్యంబు గలుగఁ ♦ గదరా సుమతీ. 46

క॥ చేతులకుఁ దొడవు దానము
భూతలనాథులకుఁ దొడవు ♦ బొంకమి ధరలోఁ
నీతియె తొడ వెవ్వారికి
నాతికి మానంబు తొడవు ♦ నయముగ సుమతీ. 47

క॥ తడ వోర్వక యొడ లోర్వక
కడువేగం బడచిపడినఁ ♦ గార్యం బగునే

తడ వోర్చిన నొడ లోర్చినఁ
జెడిపోయిన కార్యమెల్లఁ ♦ జేకురు సుమతీ. 48

క॥ తన కోపమె తన శత్రువు
తన శాంతమె తనకు రక్ష ♦ దయ చుట్టంబౌఁ
దన సంతోషమె స్వర్గము
తన దుఃఖమె నరకమండ్రు ♦ తథ్యము సుమతీ. 49

క॥ తనయూరితపసితపమును
దన పుత్రుని విద్యపెంపుఁ ♦ దనసతి రూపుం
దన పెరటి చెట్టు మందును
మనసున వర్ణింప రెట్టి ♦ మనుజులు సుమతీ. 50

క॥ తనకలిమి యింద్రభోగము
తనదుఃఖమె సర్వలోక ♦ దారిద్ర్యంబుం
దనచావు జలప్రళయము
తనవలచినయదియె రంభ ♦ తథ్యము సుమతీ. 51

క॥ తనవారు లేనిచోటను
జన వించుక లేనిచోట ♦ జగడముచోటన్
అనుమాన మైనచోటను
మనుజునకును నిలువఁ దగదు ♦ మహిలో సుమతీ. 52

క॥ తమలము సేయనినోరును
రమణుల చనుమొనలమీఁద ♦ రాయనిమేనుం
గమలములు లేనికొలఁకును
హిమధాముఁడు లేనిరాత్రి ♦ హీనము సుమతీ. 53

క॥ తలనుండు విషము ఫణికిని
వెలయంగాఁ దోఁకనుండు ♦ వృశ్చికమునకుం
దల దోఁక యనక యుండును
ఖలునకు నిలువెల్ల విషము ♦ గదరా సుమతీ. 54

క॥ తలపొడుగు ధనముఁ బోసిన
వెలయాలికి నిజము లేదు ♦ వివరింపంగాఁ
దల దడివి బాసఁ జేసిన
వెలయాలిని నమ్మరాదు ♦ వినరా సుమతీ. 55

క॥ తలమాసిన నొలుమాసిన
వలువలు మాసినను బ్రాఁతి ♦ వల్లభులైనం
గులకాంతలైన రోఁతురు
తిలకింపఁగ భూమిలోనఁ ♦ దిరముగ సుమతీ. 56

క॥ తా ననుభవింప నర్థము
మానవపతిఁ జేరుఁ గొంత ♦ మఱి భూగతమౌఁ
గానల నీఁగలు గూర్చిన
తేనియ యొరుఁ జేరునట్లు ♦ తిరముగ సుమతీ. 57

క॥ దగ్గఱఁ గొండెము సెప్పెడు
ప్రెగ్గడపలుకులకు రాజు ♦ ప్రియుఁడై మఱి తా
నెగ్గు ప్రజ కాచరించుట
బొగ్గులకై కల్పతరువుఁ ♦ బొడుచుట సుమతీ. 58

క॥ ధనపతి సఖుఁడై యుండిన
నెనయంగా శివుఁడు భిక్ష ♦ మెత్తఁగ వలసెం

ధనవారి కెంత గలిగినఁ
దనభాగ్యమె తనకుఁ గాక ♦ తథ్యము సుమతీ. 59

క॥ ధీరులకుఁ జేయుమే లది
సారం బగు నారికేళ ♦ సలిలముభంగిన్
గౌరవమును మఱి మీఁదట
భూరిసుఖావహము నగును ♦ భువిలో సుమతీ. 60

క॥ నడువకుమీ తెరు వొక్కటఁ
గుడువకుమీ శత్రునింటఁ ♦ గూరిమితోడన్
ముడువకుమీ పరధనముల
నుడువకుమీ యొరులమనసు ♦ నొవ్వఁగ సుమతీ. 61

క॥ నమ్మకు సుంకరి జూదరి
నమ్మకు మగసాలెవాని ♦ నటు వెలయాలిన్
నమ్మకు మంగడివానిని
నమ్మకుమీ వామహస్తు ♦ నవనిని సుమతీ. 62

క॥ నయమునఁ బాలుం ద్రావరు
భయమునను విషమ్మునైన ♦ భక్షింతురుగా
నయ మెంత దోసకారియొ
భయమే చూపంగవలయు ♦ బాగుగ సుమతీ. 63

క॥ నరపతులు మేర దప్పినఁ
దిర మొప్పఁగ విధవ యింటఁ ♦ దీర్పరి యైనం
గరణము వైదికుఁ డైనను
మరణాంతక మౌను గాని ♦ మానదు సుమతీ. 64

క॥ నవరసభావాలంకృత
కవితాగోష్టియును మధుర♦గానంబును దా
నవివేకి కెంత చెప్పినఁ
జెవిటికి సం కూఁదినట్లు ♦ సిద్ధము సుమతీ. 65

క॥ నవ్వకుమీ సభలోపల
నవ్వకుమీ తల్లి దండ్రి ♦ నాథులతోడన్
నవ్వకుమీ పరసతితో
నవ్వకుమీ విప్రవరుల ♦ నయ మగు సుమతీ. 66

క॥ నీరే ప్రాణాధారము
నోరే రసభరితమైన ♦ నుడువుల కెల్లన్
నారే నరులకు రత్నము
చీరే శృంగారమందురు ♦ సిద్ధము సుమతీ. 67

క॥ పగ వల దెవ్వరితోడను
వగవంగా వలదు లేమి♦వచ్చిన పిదపన్
దెగనాడవలదు సభలను
మగువకు మన సియ్యవలదు ♦ మహిలో సుమతీ. 68

క॥ పతికడకుఁ దన్నుఁ గూర్చిన
సతికడకును వేల్పుకడకు ♦ సద్గురుకడకున్
సుతుకడకు రిత్తచేతుల
మతిమంతులు చనరు నీతి ♦ మార్గము సుమతీ. 69

క॥ పని సేయునెడల దాసియు
ననుభవమున రంభ మంత్రి ♦ యాలోచనలం

దనభుక్తియెడలఁ దల్లియు
ననఁ దనకులకాంత యుండ ♦ నగురా సుమతీ. 70

క॥ పరనారీసోదరుఁడై
పరధనముల కాసపడక ♦ పరులకు హితుఁడై
పరులు దనుఁ బొగడ నెగడియుఁ
బరు లలిగిన నలుగ నతఁడు ♦ పరముఁడు సుమతీ. 71

క॥ పరసతికూటమిఁ గోరకు
పరధనముల కాసపడకు ♦ పరు నెంచకుమీ
సరిగాని గోష్ఠి సేయకు
సిరి చెడి చుట్టంబుకడకుఁ ♦ జేరకు సుమతీ. 72

క॥ పరసతుల గోష్ఠినుండిన
పురుషుఁడు గాంగేయుఁడైన ♦ భువి నిందపడుం
బరసతి సుశీలయైనను
బరుసంగతి నున్న నింద ♦ పాలగు సుమతీ. 73

క॥ పరు నాత్మఁ దలఁచుసతి విడు
మఱుమాటలు పలుకుసుతుల ♦ మన్నింపకుమీ
వెఱ పెఱుఁగని భటు నేలకు
తఱుచుగ సతిఁ గవయఁబోకు ♦ తగవుర సుమతీ. 74

క॥ పరులకు నిష్టము సెప్పకు
పొరుగిండ్లకుఁ బనులు లేక ♦ పోవకు మెపుడుం
బరుఁ గదిసిన సతిఁ గవయకు
మెఱిఁగియు బిరుసైనహయము ♦ నెక్కకు సుమతీ. 75

క॥ పర్వముల సతులఁ గవయుచు
ముర్వీశ్వరు కరుణనమ్మి ♦ యుబ్బుచు మదిలో
గర్వింప నాలిఁ బెంచుచు
నిర్వాహము లేనిచోట ♦ నిలువకు సుమతీ. 76

క॥ పలుదోమి సేయు విడియము
తలగడిగిననాఁటి నిద్ర ♦ తరుణులయెడలం
బొలయలుక నాఁటికూటమి
వెల యింతని చెప్పరాదు ♦ వినురా సుమతీ. 77

క॥ పాటెఱుఁగని పతికొలువును
గూటంబున కెఱుకపడని ♦ కోమలిరతియుం
బేటెత్తఁ జేయు చెలిమియు
నేటికి నెదు రీదినట్టు ♦ లెన్నఁగ సుమతీ. 78

క॥ పాలను గలసినజలమును
బాలవిధంబుననె యుండుఁ ♦ బరికింపంగాఁ
బాలచవిఁ జెఱుచుఁ గావునఁ
బాలసుఁ డగువానిపొందు ♦ వలదుర సుమతీ. 79

క॥ పాలసునకైన యాపద
జాలింపడె తీర్చవలదు ♦ సర్వజ్ఞునకుం
దేలగ్నిఁ బడఁగఁ బట్టిన
మే లెఱుఁగునె మీటుఁగాక ♦ మేదిని సుమతీ. 80

క॥ పిలువని పనులకుఁ బోవుట
గలయనిసతిరతియు రాజు ♦ గానని కొలువుం

బలువని పేరంటంబును
వలవని చెలిమియును జేయ ♦ వలదుర సుమతీ. 81

క|| పురికిని బ్రాణము కోమటి
వరికిని బ్రాణంబు నీరు ♦ వసుమతిలోనం
గరికిని బ్రాణము తొండము
సిరికిని బ్రాణంబు మగువ ♦ సిద్ధము సుమతీ. 82

క|| పులిపాలు దెచ్చి యిచ్చిన
నలవడఁగా గుండెగోసి ♦ యఱచే నిడినం
దలపొడుగు ధనముఁ బోసిన
వెలయాలికిఁ గూర్మి లేదు ♦ వినురా సుమతీ. 83

క|| పెట్టిన దినములలోపల
నట్టడవుల కైన వచ్చు ♦ నానార్థములుం
బెట్టని దినములఁ గనకపు
గట్టెక్కిన నేమి లేదు ♦ గదరా సుమతీ. 84

క|| పొరుగునఁ బగవాఁ డుండిన
నిరవొందఁగ వ్రాతకాఁడె ♦ యేలిక యైనన్
ధరఁ గాఁపు గొండెమైనను
గరణాలకు బ్రతుకు లేదు ♦ గదరా సుమతీ. 85

క|| బంగారు కుదువఁ బెట్టకు
సంగరమునఁ బాఱిపోకు ♦ సరసుఁడవైతే
నంగడి వెచ్చము లాడకు
వెంగలితోఁ జెలిమి వలదు ♦ వినురా సుమతీ. 86

క|| బలవంతుఁడ నాకేమని
పలువురతో నిగ్రహించి ♦ పలుకుట మేలా

బలవంతమైనసర్పము
చలిచీమలచేతఁ జిక్కి ♦ చావదె సుమతీ. 87

క॥ మండలపతిసముఖంబున
మెండైనప్రధాని లేక ♦ మెలఁగుట యెల్లన్
గొండంత మదపుటేనుఁగు
తొండము లేకుండినట్లు ♦ దోఁచుర సుమతీ. 88

క॥ మంత్రి గలవానిరాజ్యము
తంత్రము సెడకుండ నిలుచుఁ ♦ దఱుచుగ ధరలో
మంత్రివిహీనుని రాజ్యము
జంత్రపుఁ గీ లూడినట్లు ♦ జరుగదు సుమతీ. 89

క॥ మాటకుఁ బ్రాణము సత్యము
కోటకుఁ బ్రాణంబు సుభట ♦ కోటి ధరిత్రిన్
బోటికిఁ బ్రాణము మానము
చీటికిఁ బ్రాణంబు వ్రాలు ♦ సిద్ధము సుమతీ. 90

క॥ మానధనుఁ డాత్మ ధృతి చెడి
హీనుండగువాని నాశ్రయించుట యెల్లన్
మానెడుజలముల లోపల
నేనుఁగు మెయి దాఁచినట్లు ♦ నెఱుఁగుర సుమతీ. 91

క॥ రా రమ్మని పిలువనియా
భూపాలునిఁ గొల్వ భుక్తి ♦ ముక్తులు గలవే
దీపంబు లేని యింటను
జేపున కీళ్ళాడినట్లు ♦ సిద్ధము సుమతీ. 92

క॥ రూపించి పలికి బొంకకు
ప్రాపగుచుట్టంబు నెగ్గు ♦ పలుకకు మదిలోఁ
గోపించురాజుఁ గొల్వకు
పాపపుదేశంబు సొరకు ♦ పదిలము సుమతీ. 93

క॥ లావు గలవానికంటెను
భావింపఁగ నీతిపరుఁడు ♦ బలవంతుండౌ
గ్రావంబంత గజంబును
మావటివాఁ డెక్కినట్లు ♦ మహిలో సుమతీ. 94

క॥ వరదైన చేను దున్నకు
కరవైనను బంధుజనుల ♦ కడ కేఁగకుమీ
పరులకు మర్మము చెప్పకు
పిరికికి దళవాయితనము ♦ పెట్టకు సుమతీ. 95

క॥ వరిపంట లేనియూరును
దొరయుండనియూరు తోడు ♦ దొరకని తెరువున్
ధర నృపతి లేనిగృహమును
నరయంగా రుద్రభూమి ♦ యనఁ దగు సుమతీ. 96

క॥ వలరసము సతికిఁ బుట్టక
బలిమిని దమకించి విటుఁడు ♦ పైకొను టెల్లన్
మలయజము సానమీఁదను
జల ముంపక తీసినట్టి ♦ చందము సుమతీ. 97

క॥ వినఁ దగు నెవ్వరు చెప్పిన
వినినంతనె వేగపడక ♦ వివరింపఁ దగున్

గని కల్ల నిజముఁ దెలిసిన
మనుజుఁడె పో నీతిపరుఁడు ♦ మహిలో సుమతీ. 98

క|| వీడెము సేయనినోరును
జేడెల యధరామృతంబుఁ ♦ జెందనినోరుం
బాడంగ రాని నోరును
బూడిద కిరవైనపాడు ♦ బొందర సుమతీ. 99

క|| వెలయాలివలనఁ గూరిమి
గలుగదు మఱి గలిగెనేని ♦ కడతేఱదుగా
పలువురు నడచెడు తెరువునఁ
బులు మొలవదు మొలచెనేని ♦ పొదలదు సుమతీ 100.

క|| వెలయాలు సేయుబాసలు
వెలయఁగ నగసాలెపొందు ♦ వెలమ చెలిమియుం
గలలోనఁ గన్న కలిమియు
విలసితముగ నమ్మరాదు ♦ వినరా సుమతీ. 101

క|| శుభముల నొందని చదువును
నభినయముగ రాగరసము ♦ నందనిపాటల్
గుభగుభలు లేని కూటమి
సభ మెచ్చని మాటలెల్లఁ ♦ జప్పన సుమతీ 102

క|| సరసము విరసముకొఱకే
పరిపూర్ణసుఖంబు లధిక ♦ బాధలకొఱకే
పెరుఁగుట విఱుగుటకొఱకే
ధరతగ్గుట హెచ్చుకొఱకె ♦ తథ్యము సుమతీ. 103

క|| మేలెంచని మాలిన్యుని
మాలను నగసాలెవాని ♦ మంగలి హితుఁగా

నేలిన నరపతిరాజ్యము
నేలఁ గలసిపోవుఁగాని ♦ నెగడదు సుమతీ. 104

క॥ స్త్రీలయెడ వాదులాడకు
బాలురతోఁ జెలిమిచేసి ♦ భాషింపకుమీ
మేలైన గుణము విడువకు
మేలినపతి నిందసేయ ♦ కెన్నఁడు సుమతీ. 105

క॥ సిరి దా వచ్చినవచ్చును
సలలితముగ నారికేళ ♦ సలిలముభంగిన్
సిరి దాఁ బోయినఁ బోవును
గరి మ్రింగిన వెలఁగపండు ♦ కరణిని సుమతీ. 106

క॥ మది నొకని వలచి యుండఁగ
మదిచెడి యొక క్రూరవిటుఁడు ♦ మానక తిరుగున్
బదిఁ జిలుక పిల్లిపట్టిన
జదువునె యాపంజరమున ♦ జగతిని సుమతీ. 107

క॥ పుత్త్రోత్సాహమ్ము తండ్రికిఁ
బుత్త్రుఁడు జన్మించినపుడె ♦ పుట్టదు జనులా
పుత్త్రునిఁ గనుఁగొని పొగడఁగఁ
బుత్త్రోత్సాహంబు నాఁడు ♦ పొందుర సుమతీ. 108

క॥ వేసరపు జాతిగానీ
వీసముఁ దాఁ జేయనట్టి ♦ వ్యర్థుఁడు గానీ
దాసి కొడుకైనఁ గానీ
కాసులు గలవాఁడె రాజు ♦ గదరా సుమతీ. 109

సుమతిశతకము సమాప్తము.

ఉపవాచకములు.

1.	నీతికథామంజరి	అపూర్వుడు	...	0- 2-0
2.	భక్తకథామంజరి	,,	...	0- 3-0
3.	బాలధ్రువ చరిత్ర	,,	...	0- 3-0
4.	బాలకుశలవ చరిత్ర	,,	...	0- 5-0
5.	హనుమంతుడు	,,	...	0- 4-0
6.	కంసవధ	,,	...	0- 3-0
7.	రామాయణ నీతికథలు	,,	...	0- 6-0
8.	భారత నీతికథలు 1వ భాగము	,,	...	0- 6-0
9.	డిటో 2వ ,,	,,	...	0- 8-0
10.	భారతపుత్రులు 1వ భాగము	,,	...	0- 6-0
11.	డిటో 2వ ,,	,,	...	0- 8-0
12.	శ్రీకృష్ణరాయబారము	,,	...	0- 5-0
13.	రఘుకుల వీరులు	,,	...	0- 6-0
14.	భాగవత నీతికథలు	,,	...	0-10-0
15.	అభిమన్యుడు	,,	...	0- 8-0
16.	ధౌమ్యఋషి	,,	...	0-10-0
17.	ఆంధ్రవీరారాధన మొదటి భా॥	,,	...	0-12-0
18.	డిటో రెండవ భా॥	,,	...	0-10-0
19.	ఆంధ్రతేజము ,,	,,	...	0- 8-0
20.	వామన ,,	,,	...	0- 8-0

MARUTI SELECTIONS FORM PROSE & POETRY (ENGLISH)
BY KOTARU RAMARAO GARU, M. A., L.T

Part I	0—14—0
Part II	1— 0—0
Stories from Andhra Poets	0— 8—0

[illegible]:—మారుతిరాం అండ్ కో., బెజవాడ.

మారుతి వాచకములు.

(మాగంటి వేంకటరత్నము, బి.ఏ., శ్రీ గరాణా నారాయణమూర్తిగార్లచే)

మారుతివాచకము	మొదటితరగతి	అచ్చైనది	0-2-0
డిటో	రెండవతరగతి	,,	0-3-0
డిటో	మూడవతరగతి	,,	0-4-0
డిటో	నాల్గవతరగతి	,,	0-5-0
డిటో	అయిదవతరగతి	,,	0-6-0
డిటో	ఆరవతరగతి	,,	0-7-0
డిటో	ఏడవతరగతి	,,	0-8-0
డిటో	ఎనిమిదవతరగతి	,,	0-9-0
డిటో	నాల్గవఫారము	,,	0-12-0
డిటో	ఐదవఫారము	,,	0-13-0

మారుతి గణితబోధినిలు.

మారుతి గణితబోధిని	మొదటితరగతి	0-4-0
డిటో	రెండవతరగతి	0-6-0
డిటో	మూడవతరగతి	0-8-0
డిటో	నాల్గవతరగతి	0-10-0
డిటో	అయిదవతరగతి	0-11-0
డిటో	ఆరవతరగతి	0-12-0
డిటో	ఏడవతరగతి	0-14-0
డిటో	ఎనిమిదవతరగతి	1-0-0

మారుతి నూతన సివిక్స్ వాచకములు.

మారుతి నూతన సివిక్స్ వాచకము	2వ తరగతి	అచ్చైనది	0-[illegible]
,,	3వ తరగతి	,,	0-[illegible]
,,	4వ తరగతి	,,	0-[illegible]
,,	5వ తరగతి	,,	0-[illegible]

[illegible]:—మారుతి రాం అండ్ కో., [illegible]